# మనసులో మడత

చీర్ల వర్తకుడు వచ్చాడనే వార్త ఆఫీసులోని ఉద్యోగినులందరిలో చిన్న కలకలం రేపింది. ఒకరివైపు మరొకరు కనుసైగలు, కబురంపకాలు అన్నీ క్షణాలమీద జరిగిపోయాయి. మొత్తానికి అయిదు నిముషాల్లో ఆఫీసులో వున్న ఆడవాళ్ళంతా మెట్లకింద అప్పుడే తెలిసిన చీర్ల దుకాణంలో వున్నారు. ఎన్ని రంగులో! మరెన్ని హంగులో! కళ్ళు మిరిమిట్లు గొలిపే మెరుపు. అందమైన డిజైన్లు——. అందరూ ఆత్రంగా, ఆశ్చర్యంగా, అపురూపంగా చూస్తున్నారు. ఖరీదులు విని 'అమ్మో' అని అంతలోనే చిన్నబుచ్చుకున్నారు.

ఆఫీసు గర్ల్ దుర్గ మాత్రం ఆఫీసులో ఫైళ్ళు అటూ యిటూ పెడుతూ కాలుగాలిన పిల్లిలా తిరుగుతోంది. ఆమె మనస్సెప్పుడో కిందకి దిగి చీరల ఎంపికలో విహరిస్తోంది.

పది నిముషాల్లో అంతా తలొక చీరా తీసుకుని వచ్చేశారు. వరలక్ష్మి అందరికంటే అందమైనదీ, ఖరీదైనదీ కొనుక్కొని గర్వంగా వచ్చింది.

ఆడవాళ్ళంతా పైకి రాగానే, ఏదో వంకతో దుర్గ కిందకి తుర్రుమంది. అయిదే నిమిషాలలో ఓ చీర ఎంపిక చేసుకుని వచ్చేసింది.

*

ఆరోజు తను రెండు వందల రూపాయలు పెట్టి అపురూపంగా కొనుక్కొన్న చీర కట్టుకుని, తీర్చిదిద్దినట్టు టాయిలెట్ చేసుకుని ఆఫీసులో అడుగుపెట్టిన వరలక్ష్మి గతుక్కుమంది.

అదే చీర—అదే పూలు – అదే రంగు – అదే అందం - బహుశ అదే ఖరీదు –

సహజంగా అందంగా వుండే దుర్గ ఆ చీర కట్టుకొని పొందికగా స్టూలు మీద కూర్చుని వుంది. వరలక్ష్మి చీర అందంగా వుంటే - దుర్గ చీర కట్టుకోవడంవల్ల చీర అందం రెండింతలైంది. ఆఫీసులో ఎన్నో జతల కళ్ళు అటూ ఇటూ ఒకటికి పదిసార్లు మార్చి మార్చి చూశాయి. కొన్ని కళ్ళల్లో ఆశ్చర్యం కొన్ని కళ్ళల్లో హేళన - మరి కొన్ని కళ్ళల్లో కసితీరిన తృప్తి —

వరలక్ష్మి క్యాడర్. ఆఫీసు గర్ల్ క్యాడర్ కన్న మూడు మెట్లు ఎక్కువ. అలాంటిది ఆమె, తనూ ఒకేలాంటి చీర కట్టుకోవడం ఎంత నామోషీ!

పధ్నాలుగు వందలు సంపాదించే తనకీ, ముష్టి మూడొందల జీతగత్తెకి ఒకటే హోదానా ? —

వరలక్ష్మికి మనసు కలతపడి తలనొప్పి వచ్చింది. పర్మిషన్ తీసుకుని మధ్యాహ్నం ఇంటికెళ్ళిపోయింది.

*

" మీ చీర చాలా బాగుంది. ఇదెప్పుడు కొన్నారు ? " అంది మిత్రురాలు వరలక్ష్మి చీర వంక ఆశ్చర్యంగా చూస్తూ.

" అబ్బే! మొన్న రెండొందలు పెట్టి కొన్నాను చూడండి – చీర – దానిమీద వేరే రంగు అద్దించాను " అంది వరలక్ష్మి.

" అరె! అప్పుడే రంగుపోయిందా ? " అంది ఆమె మరీ ఆశ్చర్య పడిపోతూ –

" కాదు. నాకెందుకో ఆ రంగు నచ్చలేదు " అని తుంచేసిన వరలక్ష్మి ఆంతర్యం కాస్సేపటికి కానీ ఆ మిత్రురాలికి అర్థంకాలేదు.